విశాలాంధ్ర
అనకాపల్లి
సోమవారం 1, జూలై, 2024



సంకల్పం సేవా సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

విశాలాంధ్ర - ఎలమంచిలి: పట్టణంలో ఆదివారం సంకల్పం సేవా సంస్థ ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ, రక్తదాన శిబిరం కార్యక్రమాలు విజయవంతంగా జరిగాయి. సంస్థ కన్వీనర్ కూరగాయల బుజ్జి నిర్వహించిన ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. 800 మొక్కల పంపిణీతో పాటు 50 మంది రక్తదాతలు ఈ రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని సుందరపు విజయ్ కుమార్ ప్రారంభించగా టీడీపీ మాజీ ఎంపీ నేత పప్పల చలపతిరావు, టిడిపి ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావుతోపాటు జనసేన నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ మానవాళి మనగడకు చెట్లు ఎంతో అవసరం అన్నారు.

పింఛన్ల పంపిణీలో కూటమి నాయకులు భాగస్వామ్యం కావాలి

విశాలాంధ్ర - పాయకరావుపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ సచివాలయ సిబ్బందితో పింఛన్ల పంపిణీ కార్యక్రమం సోమ, మంగళవారాల్లో చేపడుతున్న నేపథ్యంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పంపిణీలో భాగస్వామ్యం కావాలని టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను కోరారు. ఈ విషయమై టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలలో పింఛన్ల పెంపు ఒకటి అన్నారు. రూ.3 వేలు ఉన్న పెన్షన్, రూ.4 వేలకు పెంచుతున్నారని, వీటితోపాటు గడచిన మూడు నెలలకు సంబంధించి వెయ్యి రూపాయలు చొప్పున రూ.3 వేలు కలిపి రూ.7 వేలు అందజేస్తారని తెలిపారు. కూటమి ప్రభుత్వం పింఛన్లు పెంచుతూ పంపిణీ చేస్తున్న విషయాన్ని పింఛనుదారులకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

కంపు కొడుతున్న వీధులు

విశాలాంధ్ర - కె.కోటపాడు: మండల కేంద్రం కే.కోటపాడులో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వాన్నంగా తయారైంది. ఎక్కడపడితే అక్కడ చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. వారానికి ఒక్కసారైనా ఈ చెత్తకుప్పలను తొలగించకపోవడంతో దుర్గంధంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీలో తగినంత మంది స్వీపర్లు లేకపోవడం, ఉన్న వారికి కూడా సకాలంలో జీతాలు ఇవ్వకపోవడంతో తూతూ మంత్రంగా పనిచేస్తున్నారు. వేసవికాలంలో ఉదయాన్నే రోడ్లపై ఉన్న చెత్తను చిన్నచిన్న కుప్పలుగా ఉంచి ఎక్కడికక్కడే తగలపెట్టేవారు. ప్రస్తుతం వర్షాలు సీజను ప్రారంభం కావడం చెత్తను కాల్చి వేయటానికి అవకాశం కుదరకపోవడంతో రోజుల తరబడి చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి. మండల స్థాయి అధికారులు సచివాలయ సిబ్బంది ఆ చెత్తకుప్పల ప్రక్కనుండే ప్రతిరోజు విధులకు వెళుతున్నా.. వారికి ఆ చెత్త కనిపించకపోవడం శోచనీయం. ప్రధానంగా గ్రామంలో ఉన్న అంగన్వాడీ కేంద్రాల వద్ద, జూనియర్ కాలేజీ, హైస్కూలు, గ్రామీణ ఆరోగ్య కేంద్రాల ఆవరణలోనూ భారీగా ఈ చెత్తకుప్పలు పేరుకుపోయి ఉన్నాయి. వాటిల్లో పందులు కుక్కలు స్వైర విహారం చేస్తుండటంతో వాటి నుండి వచ్చే దుర్వాసనకు విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం 'స్టాప్ డయేరియా' అనే కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించినా అవి ప్రకటనలకే పరిమితమయ్యాయి. ఇటీవల ఎంపీడీవో పట్నాయక్ పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్యశాఖ, గ్రామీణ త్రాగునీటి శాఖ అధికారులు, సచివాలయ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి వర్షాకాలంలో పాటించవలసిన జాగ్రత్తలపై ప్రజలను అప్రమత్తం చేయాలని పలు సూచనలు చేశారు. అతిసారం, డెంగీ, మలేరియా, డయేరియా తదితర వ్యాధులు రాకుండా గ్రామాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని ఆ సమావేశంలో కోరినా కే.కోటపాడులో మాత్రం పారిశుధ్యాన్ని పట్టించుకునే నాధుడు కనిపించలేదు. ఇప్పటికైనా మండల స్థాయి అధికారులు కే.కోటపాడు గ్రామ వీధులను సందర్శించి తక్షణమే ఆ చెత్తకుప్పలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

హెలెన్ కెల్లర్ జీవిత గాధ నేటి తరానికి స్ఫూర్తి

విశాలాంధ్ర - కశింకోట: స్థానిక కోడిగంటి గోవిందరావు భవనంలో హెలెన్ కెల్లర్ 144వ జయంతి విజువల్లి ఛాలెంజ్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు కొరుప్రోలు వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ అతి చిన్న వయస్సులో భయంకర స్కార్లెట్ వ్యాధి కారణంగా వినికిడి, దృష్టిని కోల్పోయి మాట్లాడలేని స్థితి నుంచి ప్రపంచానికి మార్గదర్శకంగా హెలెన్ కెల్లర్ జీవిత గాథ ఈనాటి యువతరానికి ఎంతో స్ఫూర్తినిస్తుందని అన్నారు. అనంతరం స్థానిక అందులు, బదిరులు, వికలాంగులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. అదేవిధంగా ఈ కార్యక్రమానికి మధ్యాహ్నం అన్నదానం చేసిన హెరామ్ ఫ్రమ్ పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి పొలమరశెట్టి పురుషోత్తంకి, వారి ట్రస్ట్ సభ్యులకు, సమావేశం ఏర్పాటు చేసుకోవడానికి సి.పి.ఐ కోడిగంటి గోవిందరావు భవనంలో మీటింగ్ హాల్‌ని ఇచ్చిన కమిటీ వారికి సంఘ ప్రతినిధులు ధన్య వాదములు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రా బ్యాంకు రిటైర్డ్ సీనియర్ జనరల్ మేనేజర్ భాస్కర్ పట్నాయక్, విజువల్లి చాలెంజ్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ బమ్మిడి రమణ, ఉత్తరాంధ్ర ఏపీ ఫెడరేషన్ ఫర్ ద బ్లైండ్ అధ్యక్షులు ఎస్.అర్జున్‌రావు, విజువల్లి ఛాలెంజ్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు కొరుప్రోలు వెంకటేశ్వరరావు, సంఘ ప్రధాన కార్యదర్శి పి.పోతురాజు, కోశాధికారి కె.వి.రమణ, మామిడి పాలెం ప్రధానోపాధ్యాయులు హెచ్‌బి శ్రీధర్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం

విశాలాంధ్ర - పాయకరావుపేట: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ప్రభుత్వంపై తిరుగుబాటు చేస్తామని మాలమహానాడు అనకాపల్లి జిల్లా అధ్యక్షులు తట్టా శ్రీనివాసరావు ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మరొకసారి వర్గీకరణ చేపడతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ అంశంపైన జాతీయ స్థాయిలో కోర్ట్ ఆఫ్ లా ద్వారా వర్గీకరణకు వ్యతిరేకంగా తగిన చర్యలు చేపట్టాలని కోరుతూ దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్‌కు వినతిపత్రం అందించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆశయాలకు వ్యతిరేకంగా, రాజ్యాంగం నిబంధనలకు విరుద్ధంగా వర్గీకరణ చేపడతామని చంద్రబాబు కుప్పం పర్యటనలో ప్రకటించడం సుప్రీంకోర్టు ధిక్కరణ క్రిందకు వస్తుందన్నారు. వర్గీకరణ రాజ్యాంగ వ్యతిరేకమని గతంలో సుప్రీంకోర్టు ఫుల్ బెంచి ధర్మాసనం తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా కల్గిన ఎస్సీల మనోభావాలను దెబ్బ తీసే విధంగా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం చర్యలు చేపడితే రాజకీయంగా తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని తట్టా శ్రీనివాసరావు తెలిపారు. మాల మహానాడు జాతీయ అధ్యక్షులు డాక్టర్ వి.ఎల్.రాజు నాయకత్వంలో వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం బలోపేతం చేస్తామన్నారు. ఈ సందర్భంగా కృష్ణ స్వరూప్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అంశం పేరుతో దళితుల ఐక్యతను విచ్ఛిన్నం చేసి శాశ్వతంగా శత్రువులుగా చేయడం ద్వారా ఎస్సీ కుల జాతులను సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో అణిచివేసి దళితుల భవిష్యత్తును దెబ్బతీయడానికి, పొలిటికల్ పవర్‌ను సాధించకుండా, బానిసలుగా మార్చడానికి చంద్రబాబు, పవన్ కళ్యాణ్, బిజెపి కుట్రలు చేయడం అత్యంత దారుణం అన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో ఉద్యమం చేపడతామని దళిత జాతుల రాజ్యాంగం కల్పించిన హక్కులకు భంగం వాటిల్లకుండా పోరాటం చేస్తామన్నారు. ఈ అంశంపైన ఇటీవల సుప్రీంకోర్టులో సైతం న్యాయ పోరాటం చేయడం జరిగిందన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా దళిత బహుజన పార్టీ జాతీయ కమిటీ సమావేశం నిర్వహించి మాలమహానాడు సంస్థలను ఐక్యత చేసి మాలల తడఖా చూపిస్తామని కృష్ణ స్వరూప్ తెలిపారు.

వికలాంగుల సమాఖ్యలో నిధులు స్వాహా

వెలుగు ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ
అక్రమాలకు పాల్పడిన వారిని సస్పెండ్ చేయాలి
ప్రజా సంకల్ప వేదిక డిమాండ్

విశాలాంధ్ర - గొలుగొండ: అనకాపల్లి జిల్లా డీఆర్డీఏ పరిధిలోని రోలుగుంట మండలం వికలాంగుల సమాఖ్యలో జరిగిన అక్రమాలకు బాధ్యులను చేస్తూ కోటపాడులో ఏపీఎంగా పని చేస్తున్న వెంకటలక్ష్మితో పాటు మరో ముగ్గురు సీసీలకు ప్రాజెక్ట్ డైరెక్టర్ శచిదేవి షోకాజ్ నోటీసులు జారీ చేశారని ప్రజా సంకల్ప వేదిక రాష్ట్ర కార్యదర్శి జక్కు నరసింహమూర్తి తెలిపారు. రోలుగుంట మండలంలో వికలాం గులకు పెట్టుబడి నిధి క్రింద (సిఐఎఫ్) సుమారు 46 లక్షలు మంజూరు చేశారని వాటిలో కొంతమంది వికలాంగులకు అందించి బినామీ పేర్లతో నిధులు కాజేశారని అన్నారు. దీనిపై జిల్లా అధికారులను ఆర్టీఐ ద్వారా సమాచారం కోరడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చిందని తెలిపారు. దీనిపై జిల్లా కలెక్టర్ సెర్ప్ సీఈవోకి ఫిర్యాదులు చేయడంతో విచారణ జరిపి అక్రమాలు నిర్ధారించి అప్పటిలో పని చేసిన ఉద్యోగులను బాధ్యులను చేస్తూ నివేదిక అందించారని, కానీ ఏ విధమైన చర్యలు చేపట్టలేదని దీనిపై ప్రజాసంకల్పవేదిక లోకాయుక్తలో ఫిర్యాదు కూడా చేయడం జరిగిందన్నారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ఇప్పటివరకు జరిగిన అక్రమాలపై దృష్టి సాధించడంతో విజయవాడ సీఈఓ కార్యాలయం నుంచి విశాఖపట్నం ప్రాజెక్టు డైరెక్టర్‌కు చర్యలు చేపట్టి పూర్తి నివేదిక అందించాలని కోరినట్లు తెలుస్తోందని ఆయన పేర్కొన్నారు. దీంతో అనకాపల్లి ప్రాజెక్ట్ డైరెక్టర్ కోటపాడు ఏపీఎంతో పాటు మరో ముగ్గురు సీసీలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారన్నారు. వికలాంగుల సమాఖ్యలో అక్రమాలు గుర్తించి ఇప్పటికే రెండుసార్లు షోకాజ్ నోటీసులు ఇచ్చారు కానీ అక్రమాలకు వత్తాసు పలుకుతూ చర్యలు తీసుకునేందుకు జాప్యం చేస్తున్నారన్నారు. తక్షణమే సస్పెండ్ చేసి వారి నుంచి వికలాంగుల యొక్క సొమ్ము రికవరీ చేయాలని డిమాండ్ చేశారు.

పెన్షన్ పంపిణీలో కూటమి నాయకులు పాల్గొనాలి

ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్

విశాలాంధ్ర - అచ్యుతాపురం: ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో నియోజకవర్గంలోని కూటమి నాయకులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు పాల్గొనాలని యలమంచిలి నియోజకవర్గ ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ పిలుపునిచ్చారు. సచివాలయ పరిధిలోని సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. ఇప్పటివరకు ఇస్తున్న రూ.3 వేలు పెన్షన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఒకేసారి 4 వేలుకు పెంచిందన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి పెంచిన మొత్తాన్ని కలుపుకొని జులై 1న రూ.7 వేలు పింఛన్ అందజేయనుందన్నారు.

వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి కాంగ్రెస్ బలోపేతం

అనకాపల్లి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఐ.ఆర్.గంగాధర్

విశాలాంధ్ర - కశింకోట: దేశభక్తి, సేవభావం, సెక్యులర్ భావజాలం ఉన్న వ్యక్తులే కాంగ్రెస్ పార్టీలో అగ్రస్థానానికి చేరుకుంటారని అనకాపల్లి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఐ.ఆర్.గంగాధర్ అన్నారు. ఆదివారం అనకాపల్లి రైల్వే స్టేషన్ రోడ్ లో గల ఎన్నికల కార్యాలయంలో అసెంబ్లీ నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి కాంగ్రెస్ పార్టీ పూర్తిస్థాయిలో బలోపేతమై అభ్యర్థులను గెలిపించాలని అన్నారు. సంస్థాగతంగా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయటానికి రాష్ట్రంలో ఉన్న అన్ని కాంగ్రెస్ కమిటీలను రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో నిబద్ధత గల కార్యకర్తగా పనిచేసేవారు, సేవా గుణంతో ఉండాలని గంగాధర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ నిర్మాణాత్మకమైన ప్రతిపక్షంగా ప్రజల పక్షాన పోరాడాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ దేశం కోసం, దేశ భవిష్యత్తు కోసం, త్యాగాలు చేసినటువంటి పార్టీ అని అన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో ప్రతి కార్యకర్త సైనికులై పనిచేయాలని కోరారు. దేశంలో మతం పేరుతో రాజకీయాలు చేస్తూ ప్రజల మధ్య వైషమ్యాలను రెచ్చగొట్టి దేశాన్ని పాలించాలని బీజేపీ కలలు కంటుందని అన్నారు. రాముడు పేరుతో రాజకీయాలు చేయడానికి ప్రయత్నించిన బీజేపీకి అయోధ్యలో పరాభవం తప్పలేదని గంగాధర్ చెప్పారు. రాజ్యాంగం, సెక్యులర్ భావజాలమే భారతదేశానికి అవసరం అని చెప్పారు. రాజ్యాంగాన్ని మార్చేస్తామని విర్రవీగిన బీజేపీ మతోన్మాదులకు గత ఎన్నికలలో దేశ ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని అన్నారు. బాబు, పవన్ మోడీ మెడలు వంచి రాష్ట్రానికి ప్రత్యేక హోదాతో పాటు విభజన హామీ చట్టాల్ని అమలుపరిచే విధంగా కృషి చేయాలని గంగాధరన్నారు. లేనియెడల రాష్ట్ర ప్రజలు కూటమిని క్షమించనని, తగిన గుణపాఠం చెప్తారని గంగాధర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి పట్టణ మాజీ అధ్యక్షుడు దాసరి సంతోష్, కసింకోట మండల కమిటీ మాజీ అధ్యక్షుడు సనేడ గజాలు, యగ్గాడ భాస్కరరావు, కొల్లి సత్యారావు, వి.రాంప్రసాద్, పీల జగ్గప్పారావు, ఏడు వాకుల దేవుడమ్మ, బెజవాడ గోవింద్ పాల్గొన్నారు.

భారత్ విజయంతో సంబరాలు

విశాలాంధ్ర - పాయకరావుపేట: టి 20 వరల్డ్ కప్ భారత్ విజయం సాధించడంతో పాయకరావుపేట క్రికెట్ ప్రేమికులు సంబరాలు జరుపుకున్నారు. బైక్ ర్యాలీలతో సందడి చేసి, భారీగా కేక్ కట్ చేసి, బాణసంచాలతో సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో క్రికెట్ ఆటగాళ్లు గొల్లపల్లి నాగు, గెద్దం చైతన్య, ధనిశెట్టి సత్య మహేష్, ఎజ్జల చంద్రశేఖర్, చలపాక నాగేశ్వరరావు, పెదిరెడ్డి నాగ వెంకటరమణ, అరుణ్, సంతోష్, కళ్యాణ్, చిన్న, సూర్య, వర్మ, అజయ్ భార్గవ్, రమేష్, అభి, యోహాన, రఘు, బాబి తదితరులు పాల్గొన్నారు.

18న ఏఎంఏఎల్ కళాశాలకు నాక్ అక్రిడేషన్ బృందం

విశాలాంధ్ర - కశింకోట: సుమారు లక్ష మంది విద్యార్థులను తీర్చిదిద్దిన చదువుల తల్లి, ఉత్తరాంధ్ర జిల్లాల్లోనే ప్రసిద్ధి చెందిన అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాలకు అన్ని విధాలా గుర్తింపును తీసుకురావడానికి కృషి చేస్తామని పూర్వ విద్యార్థుల సంఘం పేర్కొంది. అనకాపల్లి జార్జిక్లబ్ ఆవరణలో ఆదివారం జరిగిన సమావేశానికి సంఘ అధ్యక్షుడు బొడ్డేడ అప్పారావు అధ్యక్షత వహించి మాట్లాడారు. కళాశాలను ఈ నెల 18వ తేదీన జాతీయ స్థాయి నాక్ అక్రిడేషన్ బృందం పరిశీ లిస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా కళాశాలలో పూర్వ విద్యార్థుల సంఘ సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్కువ సంఖ్యలో పూర్వ విద్యార్థులు హాజరు అయ్యేలా కృషి చేస్తున్నామన్నారు. అలాగే పూర్వ విద్యార్థుల్లో అన్ని రంగాల్లో నిష్ణాతులను కూడా ఆహ్వానించనున్నామన్నారు. ఇప్పటికే పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో కళాశాలలో సోలార్ప్లాంట్, డైనింగ్ హాలు వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. కళాశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థుల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు,డీజీపీలు, ఎస్పీలు, చలన చిత్ర దర్శకులు, నటులు, శాస్త్రవేత్తలు ఉన్నారని వివరించారు. వీరందరినీ ఆహ్వానించ నున్నా మన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ గెల్లా జయబాబు, పర్యవేక్షకురాలు పెంటకోల అనూరాధ, వ్యాయామ సంచాలకుడు డాక్టర్ కేఏఎస్ నాయుడు, కార్యదర్శి పెనుమత్స కృష్ణంరాజు, కోశాధికారి వై.జగదీశ్వరరావు, జార్జిక్లబ్ కార్యదర్శి బుద్ధ కాశీ విశ్వేశ్వరరావు, విశ్రాంత ప్రిన్సిపాల్స్ దుద్దు శ్రీనివాసరావు, డాక్టర్ ఎస్ నూకరాజు,విశ్రాంత అధ్యాపకుడు పద్మనాభుని రాజేశ్వర ప్రసాద్, విశ్రాంత క్రీడాధికారి కేఎస్వీ సత్యనారాయణ, వ్యాపారవేత్త మళ్ల లక్ష్మీ ప్రసాద్, అబ్దుల్ కలాం సేవా సంస్థ చైర్మన్ ఆళ్ల ప్రవీణ్, ఉపాధ్యాయ సంఘ నాయకుడు కొణతాల రామచంద్రరావు, కోచ్ రాపేటి సీతారామ్, పలు సంస్థల ప్రతినిధులు సకురు చంద్రం, బలరామ్, సోమరాజు, గోలి వెంకటరావు, శ్రీను, నారాయణరావు, సింహాచలం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలో దార్లపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు ఆత్మీయ కలయిక జరిగింది. 1985 - 86 సంవత్సర 10వ తరగతి విద్యార్థులు ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కలవడం జరిగింది చదువుకున్న సమయంలో తన అనుభూతులను గుర్తు చేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సత్కరించారు.

పండగ వాతావరణంలో పెన్షన్ల పంపిణీకి ఏర్పాట్లు

విశాలాంధ్ర - కశింకోట: ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు పెంచిన ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను పండగ వాతావరణంలో లబ్ధిదారులకు అందజేయనున్నట్లు జీవీఎంసీ 80వ వార్డు టీడీపీ జీవీఎంసీ మున్సిపల్ టీడీపీ, జనసేన 23వ వార్డు అధ్యక్షులు బొడ్డేడ మురళి, సూరిశెట్టి రాముడు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆదేశాల మేరకు వార్డు పరిధిలోని చినరామస్వామి కోవెల వీధి, మొండెగూడెం, బాజాం వీధి దేవుడు తోట పెన్షనార్థులను కలుసుకొని పెంచిన పెన్షన్ల పంపిణీపై లబ్ధిదారులతో మాట్లాడారు. సోమవారం ఉదయం 6 గంటలకు సచివాలయం సిబ్బంది లబ్దిదారుల ఇంటి వద్దకే వచ్చి సామాజిక పింఛన్లు రూ.ఏడు వేలు, వికలాంగులకు రూ.ఆరు వేలు సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాటిచ్చిన విధంగా అందజేస్తారన్నారు. ప్రజలు మద్దతుతో గెలిచిన కూటమి ప్రభుత్వం, వారి ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటూ పాలనలో ముందుకు సాగుతోందన్నారు. గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు, చర్యలతో రాష్ట్రంలో అప్పులపాలై, ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయి అతలాకుతలమైనప్పటికీ, దాన్ని గాడిలో పెట్టేందుకు చంద్రబాబు కృషి చేస్తున్నారని, పెన్షన్ల పెంపుతో ప్రభుత్వంపై నెలకు అదనంగా రూ.819 కోట్ల భారం పడుతున్నా ప్రజల శ్రేయస్సు కోసం ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. పెరిగిన పింఛనుతో మీకు ఆర్థిక స్వావలంబన, భరోసా లభిస్తుందని ఆశిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు సూరిశెట్టి శివ, టీడీపీ నాయకులు దొడ్డి సూరప్పారావు, అందే అశోక్ పెన్షన్ లబ్దిదారులు పాల్గొన్నారు.

పెదమొల్లోడు గెడ్డలోకి ఫార్మా రసాయన వ్యర్థ జలాలు

- రాంకీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - పరవాడ: పరవాడ మండలం భరణికం గ్రామ సమీపంలోని పెదమొల్లోడు గెడ్డలోకి ఆదివారం ఉదయం ఫార్మా రసాయన వ్యర్థ జలాలను విడిచి పెట్టారు. దీంతో భరణికం గ్రామస్తులు మొల్లోడు గెడ్డ వంతెన వద్ద ఆందోళనకు దిగారు. రాంకీ యాజ మాన్యంకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. శుద్ధి చేయని రసాయన వ్యర్థ జలాలను నేరుగా గెడ్డలోకి విడిచి పెడుతున్న రాంకీ యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ గనిశెట్టి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ బోండా తాతారావు, జనసేన నాయకుడు పెద్దిశెట్టి సత్యారావు మాట్లాడుతూ ఫార్మా వ్యర్థ జలాలతో తీవ్ర దుర్వాసన వెదజల్లడంతో పాటు భూగర్భ జలాలు నాశనమవు తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే వ్యవసాయానికి నష్టం వాటిల్లి పాడి పశువులు మృతి చెం దుతు న్నాయని మండిపడ్డారు. రాంకీ యాజమాన్యం నిబంధ నలు ఉల్లంఘించి గెడ్డలు, కాలువలు, చెరువుల్లో ఫార్మా రసాయన వ్యర్థ జలాలను విడిచిపెడుతున్నా, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు ఎందుకు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. పైప్ లైన్ ద్వారా శుద్ధి చేసిన వ్యర్థ జలాలను సముద్రంలోకి పంపించవలసి ఉండగా దానికి విరుద్ధంగా శుద్ధి చేయని వ్యర్థ జలాలను చెరువుల్లోకి గెడ్డల్లోకి విడిచిపెట్టడం దుర్మార్గం అన్నారు. దీనివల్ల ప్రజా ఆరోగ్యానికి తీవ్ర నష్టం వాటిల్లుతొందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న రాంకీ యాజమాన్యంపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఎన్జీటీలో రాంకీ యాజమాన్యంపై సీపీఎం పార్టీ కేసు వేయడం జరిగిందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో భరణికం గ్రామ ప్రజలు పెదిశెట్టి వెంకట సత్యారావు, జి.అప్పలరాజు, బి.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా గనిశెట్టి సత్యనారాయణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ ముకుందరావుకు ఫోన్లో ఫిర్యాదు చేయడంతో సిబ్బంది వచ్చి ఈ గెడ్డలో నీటి నమూనాలను సేకరించారు.